

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
# వార్త


## పెండింగ్లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- పౌరసరఫరాల శాఖకు జెసి సూచన
- రేషన్ కార్డుల సర్వీసులు వేగవంతం చేయాలి
- 6ఎ కేసులపై దృష్టి పెట్టాలి
- పౌరసరఫరాల శాఖతో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 18, ప్రభాతవార్త** బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తమ చాంబర్లో జిల్లా పౌర సరఫరాల అధికారి విజయకుమార్, ఏఎస్ ఓ అంకయ్య ఆధ్వర్యంలో జిల్లాలోని సి ఎస్ డి టి లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ 6ఏ కేసుల పురోగతి, రైస్ కార్డుల ఈ కెవైసీ, మరియు రైస్ కార్డుల సర్వీసులను వేగవంతం చేయాలని జిల్లాలోని మండలాలో ఉన్న పెండింగ్ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ జిల్లా పౌరసరఫరాల అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో డిఎస్ఓ విజయ్ కుమార్, ఏ ఎస్ఓ అంకయ్య జిల్లాలోని సి ఎస్ డి టి లు, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి రాక



**విడవలూరు, జూన్ 18, ప్రభాతవార్త :** మండలం చౌకచర్ల పంచాయతీలో ఏరువాక కార్యక్రమం, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో విడవలూరు పెట్రోల్ బంకు నుండి వావిళ్ళ రోడ్డు శంకుస్థాపనలు చేయడం జరుగుతుందని స్థానిక మండల ప్రజా పరిషత్ ఎంపీడీవో నగేష్ కుమారి ఒక ప్రకటన తెలిపారు.

## బ్లాక్ స్పాట్స్ ను పరిశుభ్రంచేసి గ్రీన్ స్పాట్స్ గా మార్చండి

### కమిషనర్ వై.ఓ. నందన్



**నెల్లూరు కార్పొరేషన్,జూన్ 18 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేస్తున్న బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి, వాటిని పరిశుభ్రం చేసి గ్రీన్ స్పాట్స్ గా మార్చిన అనంతరం ఆయా ప్రాంతాల్లో వ్యర్థాలు వేయకుండా నిరంతరం పర్యవేక్షించాలని శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో వారాంతపు సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటింటి చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించేలా పర్యవేక్షించాలని, బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని ఆదేశించారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల క్రయవిక్రయాలను నిరంతరం పర్యవేక్షించి ప్లాస్టిక్ వినియోగదారులకు జరిమానాలు విధించాలని సూచించారు. నగరవ్యాప్తంగా జరుగుతున్న డ్రైను కాలువల పూడికతీత పనులతో పాటు పూర్తిస్థాయిలో సిల్ట్ తొలగించే పనులను ఈనెల చివరి నాటికి పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. నగరం మొత్తం చిన్న, పెద్ద డ్రైను కాలువల్లో జరుగుతున్న డీసిల్టేషన్ పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని తెలిపారు. వ్యాపార, వాణిజ్యాలకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ ల రెన్యువల్ ప్రక్రియను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని, అన్ని డివిజన్లలో నాట్ ట్రేస్డ్, డబల్ ఎంట్రీ, పర్మినెంట్లీ క్లోజ్డ్ ట్రేడ్లను గుర్తించి శానిటేషన్ కార్యదర్శి డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశించారు.సచివాలయం పరిధిలో వారంలో కనీసం ఐదు రోజులు తప్పనిసరిగా ఫాగింగ్ ప్రక్రియను, దోమల నివారణ పిచికారి మందులను స్ప్రేయింగ్ చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్మోహన్ రావు, ఈ.ఈ రహంతు జానీ, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్, మలేరియా విభాగం అధికారి జిజియా బాయి, సూపరింటెండెంట్ సులోచన, శానిటేషన్ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి 'ఆనం' ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం



**ఆత్మకూరు,, జూన్ 18, ప్రభాతవార్త** నియోజకవర్గ పరిధిలోని ఎన్హెచ్ 67 రహదారిపై తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు అధికార యంత్రాంగం కదిలింది. రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేషనల్ హైవే అథార్టీ అధికారులకు రాసిన లేఖపై ఆయా శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. ఎన్హెచ్-67(హుబ్లి-కృష్ణపట్నంరోడ్)లోని కీకలమైన జంక్షన్ 693కి.మీ వద్ద 0కిమీ వద్ద రాష్ట్ర రహదారి 335(ఆత్మకూరు-హసనాపురం రోడ్)తో కలుస్తున్న ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతునా న్నరని మంత్రి లేఖలో పేర్కొంటూ ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనల మేరకు బుధవారం నేషనల్ హైవే అథార్టీ , పోలీసు, రెవెన్యూ, ఆర్అండ్బి అధికారులు సంయుక్తంగా ఈ రహదారిని పరిశీలించారు. ఇటీవల జరిగిన ప్రమాదాల తీరుతెన్నులను విశ్లేషించారు. ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు. ఈమేరకు నేషనల్ హైవే అథార్టీ ప్రనాజెక్ట్ డైరెక్టర్ కెపి చౌదరి మాట్లాడుతూ మంత్రి సూచనల మేరకు ఈ రహదారిని పరిశీలించామన్నారు. మితిమీరిన వేగం, ఓవర్లోడ్ కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నట్లు నిర్ధారించారు. ఈమేరకు అన్ని శాఖల సమన్వయంతో వాహనదారులకు అతివేగం, అధికలోడ్ నివారించేలా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, అవసరమైన సూచిక బోర్డులు, రహదారిపై పెయింటింగ్ ఏర్పాటు చేస్తామని ఈసందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డిఓ బి.పావని, ఆర్అండ్బి ఎస్ఇ గంగాధర్, జిల్లా రవాణాశాఖ అధికారి చందర్, పంచాయతీరాజ్ ఇఇ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత వైభవంగా శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహణ

- 25 నుండి జూలై 15 వరకు 21 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు
- ప్రతి మూడేళ్లకు ఒకసారి బ్రహ్మోత్సవాలు
- ఆర్ డి ఓ ఎన్ఎస్ అనూష అధికారులకు సూచన





**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 18, ప్రభాతవార్త** ప్రతి మూడేళ్లకు ఒకసారి జరిగే శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి వారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని నెల్లూరు ఆర్ డి ఓ ఎన్ఎస్ అనూష సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం మూలపేటలోని ద్రౌపతి దేవి సమేత శ్రీకృష్ణ ధర్మరాజ స్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాల నిర్వహణకు సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఈనెల 25 నుండి జూలై 15 వరకు 21 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. మహాభారతంలోని అన్ని ఘట్టాలను 21 రోజుల పాటు ఉత్సవాలు రూపంలో ప్రదర్శించడం ఈ బ్రహ్మోత్సవాల ప్రత్యేకతగా ఆర్డీవో చెప్పారు. మూడేళ్లకు ఒకసారి నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా వచ్చే నెల 5వ తేదీ తపస్సు మాను ఉత్సవం, 13వ తేదీ అగ్నిగుండం ఉత్సవాలకు భక్తులు విశేషంగా హాజరవుతారని అందుకు తగ్గట్లుగా అన్ని ఏర్పాట్లు చేయవలసిందిగా కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా మున్సిపల్ శాఖ వారు శివాలయ పరిసర ప్రాంతాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచి బ్లీచింగ్, మంచి నీటి సరఫరా తదితర పనులు చేయాలన్నారు. పోలీస్ శాఖ వారు బందోబస్తు ఏర్పాటుతోపాటు తపస్సు మాను, అగ్నిగుండం రోజున ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ వారు అగ్నిగుండం రోజున అప్రమత్తంగా ఉంటూ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్రౌడ్ మేనేజ్మెంట్ను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అంతరాయం లేని నిరంతర విద్యుత్ ప్రసారానికి చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ప్రాథమిక చికిత్సకు అవసరమైన అన్ని మందులతో పాటు ఎండలు ఎక్కువగా ఉన్నందున ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల ఆహ్వాన కరపత్రాలను, వాల్ పోస్టర్లను అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నేతలు ఆవిష్కరించారు.ఈ సమావేశంలో దేవాదాయ సహాయ కమిషనర్ జనార్ధన్ రెడ్డి, ఆలయ ఈవో జానకి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అనూరాధ, వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి , విద్యుత్, పోలీసు మున్సిపల్ మున్సిపల్, ఫైర్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కాకాణిని వెంటాడుతున్న కోర్ట్ కేసులు



**నెల్లూరు క్రైమ్, జూన్ 18, ప్రభాతవార్త:** మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని కోర్టు కేసులు వెంటాడుతూనే ఉన్నాయి. బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ ఊరట మాత్రం లభించడం లేదు. తాజాగా బుధవారం ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి సంతకం ఫోర్జరీ చేసి గ్రావెల్ మట్టిని తరలించిన కకేసులో 14 రోజులు రిమాండ్ విధిస్తూ జిల్లా రెండవ అదనపు మేజిస్ట్రేట్ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. సర్వేపల్లి రిజర్వాయర్లో అక్రమ గ్రావెల్ తరలింపులో కాకాణి ఏ 2గా ఉన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జూలై 2వ తేది వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశించారు. అనంతరం కాకాణిని పోలీసులు నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. అంతక్రితం ఎస్సీ, ఎస్టీ కేసులో కాకాణి బెయిల్ ఫిటిషన్ విచారణను ఈనెల 20కి ఎస్సీ,ఎస్టీ న్యాయస్థానం వాయిదా వేసింది. అక్రమ మైనింగ్ కేసులో రిమాండ్ లో ఉన్న మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి బెయిల్ పిటిషన్ పై నెల్లూరు జిల్లా కోర్టులో బుధవారం వాదనలు ముగిసిన తరువాత ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి సరస్వతి తీర్పునిచ్చారు. మొత్తం కాకాణి గోవర్ధన్ రెడ్డి మూడు కేసుల్లో రిమాండ్ ఖైదీగా కారాగారంలో ఉన్నారు.

## ఇంటర్ ఆన్సర్ సీట్స్ టాంపరింగ్ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ చేయాలి



**కందుకూరు, జూన్ 18, ప్రభాతవార్త** కందుకూరులో ఇంటర్ ఆన్సర్ సీట్స్ టాంపరింగ్ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని శ్రీ గాయత్రి కాలేజీ యాజమాన్యం డిమాండ్ చేసింది. బుధవారం కళాశాల ఆవరణలో శ్రీ గాయత్రీ విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణ డైరక్టర్ భరద్వాజ్తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. తమ కళాశాలకు చెందిన మెరిట్ విద్యార్థులను దెబ్బతీసేందుకు శ్రీ వివేక్ జూనియర్ కళాశాల యాజమాన్యం దుర్మార్గమైన కుటిల యత్నాలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు చరిత్రలో కనివిని ఎరుగని స్కామ్కు శ్రీ వేవిక జూనియర్ కళాశాల మేనేజ్మెంట్ తెగబడిందని ఆరోపించారు. గత మార్చి నెలలో శ్రీ వివేక కళాశాల సెంటర్లో జరిగిన ఇంటర్ పరీక్షల్లో గాయత్రీ కళాశాల విద్యార్థులు అవినాష్బాబు, సాయి తేజస్వినిల ఆన్సర్ సీట్స్ను టాంపర్ చేశారని, దానిని ధృవీకరించనున్న ఇంటర్ బోర్డు సెక్రటరీ నష్టపోయిన మార్కులను కలిపి విద్యార్థులకు న్యాయం చేశారని కొనియాడారు. టాంపరింగ్కు పాల్పడిన కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర స్థాయి అధికారులతో విచారణ జరిపారని అన్నారు. ఆ విచారణలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయని అన్నారు. బోర్డు అనుమతి లేని ఓ షెడ్డులో బాధిత విద్యార్థులు పరీక్షలు రాసిన సంగతి బయటపడిందని అన్నారు. ఈ ట్యాంపరింగ్ వ్యవహారానికి సంబంధించి కీలకమైన ఆధారం కూడా బయటపడిందని అన్నారు. శ్రీ వివేక కాలేజీ ఎగ్జామినేషన్ సెంటర్లో కీలకమైన అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్గా ఆ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు విధి నిర్వహణ చేయాలిన ఉండగా కాలేజీ మేనేజ్మెంట్ దుర్బుద్ధితో షాహుల్ హమీద్ అనే ఓ ప్రైవేటు వ్యక్తిని అబ్బూరి వెంకటేశ్వర్లు స్థానంలో నియమించిందని అన్నారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ గుర్తింపు కూడా లేని ఒక ప్రైవేటు వ్యక్తిని నిబంధనలకు విరుద్ధంగా అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్గా ఎలా నియమిస్తారని రామకృష్ణ నిలదీశారు. ట్యాంపరింగ్కి సంబంధించిన అసలైన కుట్ర ఇక్కడే జరిగిందని స్పష్టం చేశారు. అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్గా తాను పని చేసినట్లు షాహుల్ హమీద్ విచారణ అధికారి ముందు అంగీకరించి స్టేట్మెంట్ కూడా ఇచ్చారని తెలిపారు. ఈ వ్యవహారంతో శ్రీ వివేక కాలేజీ మేనేజ్మెంట్ కుట్ర కోణం బట్టబయలైందని అన్నారు. రాష్ట్ర స్థాయి అధికారిణి విచారణ జరిపి రెండు వారాలు గడిచినప్పటికి అక్రమాలకు తెగబడ్డ శ్రీ వివేక కాలేజీ మేనేజ్మెంట్ పై కఠిన చర్యలు ఎందుకు తీసుకోలేదని రామకృష్ణ ప్రశ్నించారు. విద్యార్థుల ఆన్సర్ సీట్స్ ట్యాంపరింగ్ జరిగిందని నిర్ధారణకు వచ్చిన ఇంటర్ బోర్డు సెక్రటరీ అప్పుడే క్రిమినల్ కేసులు నమోదు చేయమని ఆదేశించారని అయితే ఇంత వరకు క్రిమినల్ కేసు ఎందుకు నమోదు కాలేదని నిలదీశారు. జరిగిన ట్యాంపరింగ్ వ్యవహారం ఇంటర్ బోర్డు నిర్వహించే జంబ్లింగ్ పరీక్షా విధానాన్ని ప్రశ్నార్థకం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమాలు జరిగినప్పుడు అధికారులు కఠినమైన చర్యలు తీసుకోకపోతే విద్యా వ్యవస్థకి తీరని కళంకం ఏర్పడుతుందని అన్నారు. ఇప్పటికైనా బోర్డు ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి శ్రీ వివేక కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, మొత్తం వ్యవహారంపై నిగ్గు తేల్చేందుకు విజిలెన్స్ విచారణ చేపట్టాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

## వాలంటీర్ తప్పిదం, ఆ కుటుంబానికి శాపం



**ఉదయగిరి, జూన్ 18, ప్రభాతవార్త** గత ప్రభుత్వం లో నియమించిన వాలంటీరు తప్పిదం షేక్ జమీన్ కుటుంబానికి శాపంగా మారింది. హౌస్ ఓల్డ్ మ్యాపింగ్ లో ప్రభుత్వ ఉద్యోగిని చేర్చడం వల్ల ఆ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు దూరమయ్యాయి. ఉదయగిరి మండలం షబ్బీర్ కాలనీ షేక్ జమీన్ భర్త చనిపోవడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. నిరుపేద కుటుంబం అయిన షేక్ జబిన్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంది. ప్రభుత్వం ద్వారా అందే పథకాలు కూడా ఆ కుటుంబానికి దూరమయ్యాయి. ఈ తరుణంలో ఆదుకునే అండలేక ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడబోగా, స్థానికులు అడ్డుకున్నారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి విషయాన్ని తీసుకువచ్చారు. వెంటనే ఎమ్మెల్యే ఉదయగిరిలోని షేక్ జమీనా నివాసానికి చేరుకుని ఆ కుటుంబాన్ని ఓదార్చారు. కాకర్ల చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.50వేల తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రభుత్వ పథకాలు అందేలాగా, ఉద్యోగి పేరు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం ద్వారా ఇల్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. మీ కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ఎమ్మెల్యే దాతృత్వాన్ని సేవా భావాన్ని చూసిన ఆ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సీహెచ్ బయన్న, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ రియాజ్, తుమ్మల కిరణ్, రోశయ్య, మధురెడ్డి, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

## వ్యభిచార గృహంపై పోలీసులు దాడి



**కందుకూరు, జూన్ 18, ప్రభాతవార్త** గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను కందుకూరు పట్టణ పోలీసులు చాకచక్యంగా దాడి చేసి పట్టుకున్నారు. గురువారం పట్టణ ఎస్సై శివ నాగ రాజుకు అందిన సమాచారంతో పట్టణంలోని ఉప్పు చెరువులో ఓ ఇంట్లో వ్యభిచార దందా సాగుతుందని సమాచారం అందింది. దీంతో ఆయన తన సిబ్బందితో ఆ గృహంపై దాడి చేసి నిర్వాహకురాలితో పాటు ఇద్దరు మహిళలు, ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై శివ నాగరాజు మాట్లాడుతూ పట్టణంలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఉపాధి హామీ పనులపై డ్వామా పీడీ గంగాభవాని అసంతృప్తి




**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 18, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమం నెల్లూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. డ్వామా పీడీ గంగాభవాని నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామాల వారీగా జరిగిన పని దినాలు, ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులు తదితర అంశాలపై డ్వామా పీడీ గంగాభవాని ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి వివరాలు సేకరించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో నిధుల దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. దీనిపై లోతుగా పరిశీలించి అందుకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతిని ఉపేక్షించబోమన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన నిధుల దుర్వినియోగంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.



కార్యక్రమంలో డ్వామా ఏపీడీ గాయత్రీదేవి, ఎంపీపీ విజయ్ కుమార్, ఇన్ఛార్జి ఎంపీడీఓ రమేష్, రిసోర్స్ పర్సన్ రవి, ఎస్టీయం కోనయ్య, ఖలీల్, అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## 27న మెగా జాబ్ మేళా

- కూటమి ప్రభుత్వం పనితీరుపై ప్రజలు హర్షం - టిడిపి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ముత్తుకూరు, జూన్ 18, ప్రభాతవార్త** 27వ తేదిన 28 కంపెనీలతో వెంకటాచలం మండలంలోని విక్రమ సింహపూరి యూనివర్శిటీలో మెజా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని టిడిపి సర్వేపల్లి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పోలంరాజుగుంటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని దీనికి బ్రహ్మరథం పడుతుందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తున్నారన్నారు. పోలం రాజుగుంట హరిజనవాడలో కమిటీ హాలు ఏర్పాటు చేస్తామని, అలాగే గిరిజన కాలనీలో దెబ్బతిన్న ఇళ్లను పూర్తి చేస్తామని, త్రాగు నీటి సమస్యను కూడా పరిష్కరిస్తామన్నారు. గిరిజనులకు స్మశానం లేదని చెప్పడంతో ఈ విషయాన్ని కూడా శాసన సభ్యులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నామన్నారు. మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, సన్నారెడ్డి బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పాపారెడ్డి శ్రీధర్ రెడ్డి, పార్లపల్లి శ్రీనివాసులు రెడ్డి, మునుకూరు రవికుమార్ రెడ్డి, అక్కయ్యగారి ఏడుకొండలు, మామిడాల శ్రీనివాసులు, ఈదూరు రామ్మోహన్ రెడ్డి, పేర్నేటి రామ్మోహన్ రెడ్డి, మునిరెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## గిద్దలూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**సైదాపురం, జూన్ 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గిద్దలూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సేవ కేంద్రం పరిధిలోని పంట పొలాలను ఆమె పరిశీలించారు. అనంతరం రైతుల కొరకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై వివరించి అధిక దిగుబడి వచ్చే పంటలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ పథకం పొందాలంటే ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మస్తాన్, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి రేషన్ షాపుకు రెన్యువల్ తప్పనిసరి



**కోవూరు, జూన్ 18 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని రేషన్ దుకాణాలు తప్పనిసరిగా తమ లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య పేర్కొన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన రేషన్ డీలర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రేషన్ షాపు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులకు సరుకులు ఇవ్వాలని, అదే సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన వేళలు తప్పక పాటించాలన్నారు. ప్రతి షాపు ముందు రేషన్ బోర్డు , స్టాక్ బోర్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రజల నుంచి రేషన్ విషయంలో ఫిర్యాదులు వస్తే ఆటువంటి డీలర్లపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్డుదారులను ఇబ్బంది పెట్టకుండా సకాలంలో సరుకులు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వృద్ధులకు ఇంటి దగ్గరే రేషన్ అందజేయాలన్నారు. ఈ ప్రక్రియ ప్రతి నెల 5వ తేదీ లోగా పూర్తి కావాలన్నారు. కోవూరు మండలంలో ఇంకా 350 యూనిట్లు ఈకేవైసీ చేసుకోవాల్సి ఉందన్నారు. ప్రతి షాపులో ఈకేవైసీ సంబంధించిన రిజిస్టర్లు ఏర్పాటు చేసుకుని ఈకేవైసీ ఎవరు చేసుకోలేదు.. వారిలో ఐదేళ్ల లోపు ఎంతమంది ఉన్నారు.. 80 సంవత్సరాల వృద్ధులు ఎంతమంది ఉన్నారు.. ఎంతమంది వేరే ఊరికి వెళ్లారు అనే విషయాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. ఈకేవైసీ చేసుకోకపోతే రేషన్ నిలిపివేయడం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బషీర్, జిల్లా రేషన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీవీ కృష్ణారెడ్డి, డీలర్లు ఉన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



**కోవూరు, జూన్ 18 ప్రభాతవార్త :** రాష్ట్రంలో జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం కోవూరులోని సత్యాన్వేషణ చైతన్య ధ్యాన ప్రశాంత నిలయం, శ్రీకృష్ణ ధ్యాన యోగా కేంద్రం వారి సంయుక్త ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి బజార్ సెంటర్ వరకు యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ యోగా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలన్నారు. రోజూ ప్రాణాయామం, ధ్యానం చేయడం వలన ఒత్తిడి దూరమవుతుందన్నారు. యోగా చేయడం వలన శారీరక, మానసిక ఆరోగ్యం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని యోగ సాధనతో మానసిక ఒత్తిడి నుంచి బయట పడాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ ర్యాలీ కార్యాలయం నుంచి బజార్ సెంటర్ వరకు నినాదాలు చేస్తూ కొనసాగింది. ఈ ర్యాలీలో యోగా గురువులు సురేష్, రవి, గోళ్ల జనార్ధన్, గోపాలకృష్ణయ్య, రఘురామయ్య, సలీమ్, ప్రసన్న, తదితరులు యోగా ప్రాముఖ్యతను వివరించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



**కోవూరు, జూన్ 18 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని , తల్లిదండ్రులు పూర్తిస్థా యిలో ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో-2 వై.చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరులోని ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందన్నారు. బ్యాగ్‌తో పాటు పాఠ్య పుస్తకాలు, బూట్లు, బెల్టు, తెలుగు, ఆంగ్ల నిఘంటువులు, ఏకరూప దుస్తులు అన్నీ ఉచితంగా అందజేస్తున్నారన్నారు. వీటితో పాటు మధ్యాహ్న భోజన పథకం కూడా మెనూలో నూతన మార్పులు తీసుకువచ్చి సన్నబియ్యంతో విద్యార్థులకు భోజనం అందిస్తున్నారన్నారు. ఏజెన్సీలు కూడా నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మోడల్ ప్రైమరీ స్కూల్, మోడేగుంట మెయిన్ పాఠశాలలో చిన్నారులకు యోగాపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలంటూ వినతి



**కలువాయి జూన్ 18 ప్రభాతవార్త :** సోమశిల డ్యామ్ గేట్ల నుండి నీటిని దిగుగ ప్రాంతాలకు విడుదల చేయడం వల్ల ఆర్టీసి బస్సులు రాకపోకలను నిలిపి వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే మార్గాన ఉప్పలపాడు నుండి సోమ శిలకు అక్కడి నుండి నెల్లూరుకు నేరుగా బస్సు ప్రయాణం కొనసాగి ంచడం జరుగు తుంది.ఈ విధంగా ఆమార్పు చేయడం వల్ల మండలంలోని రాజుపాళెం గ్రామం లోని ఎస్‌సి కాలనీ వాసులు ముఖ్యముగా విద్యార్థులు రవాణా సౌకర్యం లేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని కలువాయి మండల జనసేన పార్టీ ఆద్వర్యంలో బుధవారం ఆర్టీసి చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డితోపాటు ఆర్‌టిసి అధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి వినతి పత్రాన్ని సమర్పించారు. ఇందుకు స్పందించిన వారు ఉదయం 8.30 గంటలకు రాజుపాళెం నుండి అదే విధంగా సాయింత్రం 4 గంటలకు కలువాయినుండి రాజుపాళెం వెళ్ళేందుకు బస్సు సౌకర్యాన్ని ప్రారంభించడం జరిగిందని ఆ పార్టీ మండలాద్యక్షులు పెరమకొండ మనోహార్ నాయకులు మాలే హరిప్రసాద్,పిచ్చయ్యలు తెలిపారు.

## ఘనంగా అన్నదానం



**కోవూరు, జూన్ 18 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న శ్రీ షిరిడీ సాయి మందిరంలో బుధవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి ఉభయకర్తలుగా పద్మ, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకురాలు పచ్చిపాల సుజాత, ధర్మకర్తలు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, డాక్టర్ పచ్చిపాల మల్లికార్జునరెడ్డి, భక్తులు ఉన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు స్ఫూర్తిదాయకం



**కోవూరు, జూన్ 18 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన సైన్స్ ఉపాధ్యాయులు ఎస్‌కే షరీఫ్, హిందీ ఉపాధ్యాయులు రమణయ్య దంపతులను బుధవారం స్థానిక జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన అభినందన సన్మాన సభలో డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర నాయక్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి ఆధ్వర్యంలో శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికీ పదవీ విరమణ తప్పదని, అయితే ఆ పదవిలో ఉండగా తాము చేసిన సేవలే నిలిచిపోతాయన్నారు. ఉపాధ్యాయులుగా ఎంతోమంది విద్యార్థులను భావిపౌరులుగా తయారు చేసే అవకాశం వారికే దక్కిందన్నారు. అటువంటి వారిని ప్రస్తుత ఉపాధ్యాయులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి మాట్లాడుతూ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే చదువు ఒక్కటే ప్రధాన ఆయుధమని, దీనిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు తమ బిడ్డలను చక్కగా చదివించాలన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు షరీఫ్, హిందీ ఉపాధ్యాయులు రమణయ్య సేవలు అజరామరమని, అటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ, జేబీఆర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. శ్రీహరిలు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అనేక మంది ఉపాధ్యాయులు షరీఫ్, రమణయ్య దంపతులను శాలువా పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు.

## ఈ ఒక్కరోజే 14 పార్కులకు శంకుస్థాపన చేసిన రూరల్ ఎమ్మెల్యే



**నెల్లూరు రూరల్, జూన్ 18, ప్రభాతవార్త :** ఈ ఒక్కరోజే 14 పార్కులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శంకుస్థాపన చేసారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రభుత్వ ఆస్థులను కబ్జా చేయాలనుకుంటే తాట తీస్తా. కబ్జా దారులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హెచ్చరిం చారు. నేటి ఉదయం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 18, 19, 20 డివిజన్‌లలో 14 పార్కులకు స్థానిక ప్రజలతో కలసి శంకుస్థాపన కార్యక్రమాలలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. 150 కోట్లు విలువ చేసే పార్కు స్థలాలను కబ్జా దారులకు చెందకుండా చేస్తామన్నారు. ప్రజల ఆస్థిని, ప్రభుత్వ ఆస్థిని కాపాడామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రభుత్వ ఆస్థులను కబ్జా చేయాలనుకుంటే తాట తీస్తా అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మీ ఆటలు సాగవని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఎన్నికలు లేనివేళ రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుదామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఎప్పుడూ జరగని అభివృద్ధి ప్రజల సహకారంతో జరుగుతుందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జీ, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పాఠశాలలో యోగ శిక్షణాతరగతులు




**కావలిరూరల్, జూన్18 ప్రభాత వార్త :** కావలి పాతవూరులోని పురపాలకసంఘ ఉన్నత పాఠశా లలో ఎన్‌సిసి అధికారి షేక్. మ స్తాన్‌వలి ఆధ్వర్యంలో యోగ గురువు గోపాల్ శిక్షణలో అంత ర్జాతీయ యో గదినోత్స వాన్ని పురస్క రించుకుని బుధవారం పాఠశాలలో ఎన్‌సిసి విద్యార్థు లకు యోగశిక్షణ తరగతులు నిర్వహి ంచడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు సుజాత పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిరోజూ యోగ సాధన చేయడం వలన మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా, ఉత్సా హంగా ఉంటారని తెలియచేశారు. ఏకాగ్రత, క్రమశిక్షణలు అలవడతాయని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

## లారీ బోల్తా... డ్రైవర్‌కి గాయాలు



**కావలిరూరల్, జూన్18 ప్రభాతవార్త :** కావలి పరిధిలోని మద్దూరుపాడు జాతీయరహదారిపై బుధవారం కర్ణాటక నుండి ఒరిస్సాకు క్యాబేజి లోడుతో వెళుతున్న లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. లారీ డ్రైవర్ కల్లు వీరయ్య నిద్రమత్తు కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థాని కులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

## రైతులకు రాయితీ పచ్చిరొట్ట విత్తనాలు పంపిణి




**చేజర్ల జూన్ 18 ప్రభాతవార్త :** చేజర్ల మండ లంలోని అన్ని రైతు సేవ కేంద్రాలలో రైతు లకు రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలను పంపిణి చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి పిఎస్ హిమ బిందు తెలిపారు. ఈ సంద ర్భంగా తూర్పుపల్లి మామూడూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్య క్రమంలో మండల వ్యవసాయాధికారి పి.ఎస్ హిమబిందు మాట్లాడుతు రైతులకు పచ్చిరొట్ట ఎరువులు వాటి ప్రాముఖ్యత,వరిలో మొలక శాతం నిర్ధారించుట విత్తన శుద్ధి గురించి నారుమడిలో యాజమాన్యం గురించి అవగాహన కల్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. అదే విధంగా సబ్సిడి ద్వారా పచ్చిరొట్ట ఎరువులు,జనుము, జీలుగా,పిల్లి పెసర, తమ యొక్క రైతు సేవా కేంద్రంలో తీసుకోవాల్సిందిగా తెలియజేశారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతు జాబితాను ఆయా గ్రామంలో రైతు సేవా కేంద్రంలో ఉంచుతామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు,సుజాత,డివి సుబ్బారావు, నితీష్‌కుమార్, శ్రీను రైతులు పాల్గొన్నారు.

## బుట్ల రమణమ్మ నేత్రదానం



**విడవలూరు, జూన్ 18, ప్రభాతవార్త:** మండల కేంద్రం కామాక్షి నగర్ కాలనీకి చెందిన బుట్ల రమణమ్మ(80) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యుల సహకారంతో మనసేవ సంస్థ వ్యవస్థాపకులు దేవళ్ళ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్‌కి దానం చేశారు. ఐ టెక్నీషియన్ నాగేశ్వరావు నేత్రాలను స్వీకరించారు.

## మంత్రి ఆనం చొరవతో తలుపూరుపాడు చెరువు కట్ట అభివృద్ధి



**సంగం జూన్ 18 ప్రభాతవార్త :** మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో తలుపూరుపాడు చెరువు కట్ట అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్ళుగా కట్టపై నడవలేక ఇబ్బందులు పడుతున్న రైతులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులతో కలిసి నీటి సంఘం అధ్యక్షులు బాబుదేవాదాయ శాఖ మంత్రి ఆనం దృష్టికి తీసుకెళ్ళిడం జరిగింది. వెంటనే స్పందించిన ఆయన చెరువు కట్ట అభవృద్ధికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. మంత్రి ఆనం చొరవతో ముమ్మరంగా చెరువు కట్ట అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.
దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చంద్రశేఖర్ రెడ్డిని కలిసిన మహమ్మద్ రఫుద్దీన్



**నెల్లూరు రూరల్, జూన్ 18, ప్రభాతవార్త :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా నూతనంగా ఎన్నుకున్న మహమ్మద్ రఫుద్దీన్ మర్యాదపూ ర్వకంగా నెల్లూరు రాంజి నగర్ వైసిపి నగర కార్యాలయంలో నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకి సెల్యూకపి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మహమ్మద్ రఫుద్దీన్‌కి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో మైనార్టీ ప్రజల గొంతుకై సమస్యలపై పోరాడాలని ఆయనకి తెలిపారు. ఈ ప్రభుత్వ ఏర్పడ్డప్పటినుండి అమాయక ప్రజలపై దౌర్జన్యాలు అరాచకాలు ఎక్కువయ్యాయని వైసిపి మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా వీటిని నిలదీయాలని ఆయనకి పిలుపునిచ్చారు. చంద్రశేఖర్ రెడ్డిని కలిసేందుకు ఆయనతో పాటు వైఎస్ఆర్సిపి మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వైసీపీ ముస్లిం సంచార జాతుల విభాగం అధ్యక్షుడు బాబు, 14 డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ మస్తాన్, మైనారిటీ నాయకులు షఫీ, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## కండలేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వి. గజేంద్ర రెడ్డి



**కండలేరుడ్యాం(రాపూరు),జూన్18ప్రభాతవార్త :** మండలంలోని కండలేరు జలాశయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వి. గజేంద్ర రెడ్డి బుదవారం భాద్యతలు స్వీకరించారు. సాధారణ బదిలలో బాగంగా ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలాశయం పరిధిలో వున్న రైతులకు అందుబాటులో వుండటంతో పాటు, కండలేరుడ్యాం అభివృద్ధికి తన వంతు కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## వేరుశనగ విత్తన శుద్ధి పై అవగాహన



**విడవలూరు, జూన్ 18 ప్రభాతవార్త:** మండలం రామతీర్థం రైతు సేవా కేంద్రం పరిధిలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ శ్రీ లక్ష్మి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరు వులను వినియోగించుకోవాలని తద్వారా అధిక దిగుబడులు రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మహేష్, పూజిత, వరిణి పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి, వి హెచ్ ఏ సౌజన్య, సర్పంచ్ రావెళ్ల మల్లికార్జున్, స్థానిక నాయకులు మద్దులూరు వెంకట్ రాజు, బెల్లంకొండ శ్రీధర్, ఉప్పల వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో సిసి రోడ్ ఏర్పాటు



**కొడవలూరు, జూన్ 18, ప్రభాతవార్త :** మండలం మిక్కిలం పేట పంచాయతీ పరిధిలో ఎన్నో ఏళ్ల నుండి సరైన స్థానిక గ్రామంలో వీధి సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సహకారం ఎన్ఆర్ఈజీఎస్ ఐదు లక్షల నిధులతో సిసి రోడ్డు ప్రారంభించడం జరిగిందని సర్పంచ్ కోడూరు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు తోపాటు గ్రామాలు అభివృద్ధి బాటలో ముందుకు సాగుతున్నాయని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కోవూరులో మొట్టమొదటి సారిగా మహిళా ఎమ్మెల్యే వచ్చిన తర్వాత నియోజకవర్గం అభివృద్ధి చెందుతున్నారు. నెల్లూరు జిల్లాలో వి పి ఆర్ అంటే, మంచి పేరు విపిఆర్ ఫౌండేషన్, కన్స్ క్షన్, క్యాన్సర్, వికలాంగులకు ట్రై సైకిళ్లు, వాటర్ ప్లాంట్లు, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం చేయడం విపిఆర్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో గండవరం బిట్టు 2 చైర్మన్ కోడూరు సుధాకర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కర్నాటి ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి పి.వేణుగోపాల్, ఉప సర్పంచ్ మహేష్, ఉక్కాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరిశుభ్రత పై తనిఖీ



**కొడవలూరు, జూన్ 18, ప్రభాతవార్త:** మండలం మానేగుంటపాడు ఎస్టి కాలనీలో పారిశుద్ధింపై స్థానిక ఎంపీడీవో వెంకట సుబ్బారావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన ముఖాముఖిగా మాట్లాడడంతో గిరిజనులు కాలనీలో సైడ్ కాలువలు లేవు నూతనంగా సైడ్ కాలువలను నిర్మించాలని కోరారు. దీంతో ఎంపీడీవో పై అధికారులు తెలియపరచి చర్యలు తీసుకుంటాం, అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన మురికి కాలువ సమస్యపై స్థానిక పంచాయతీ కార్యదర్శికి రోడ్డుపైకి నీళ్లు రాకుండా చూడాల్సిన బాధ్యత ఉందని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## చిలక వాహనంపై రామలింగేశ్వర స్వామి



**విడవలూరు, జూన్ 18, ప్రభాతవార్త :** మండలం రామతీర్థం గ్రామంలో వెలసియున్న రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం చిలక వాహనంపై అంగరంగ వైభవంగా పూజలు నిర్వహించడంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుండి స్వామి, అమ్మవార్లకు వివిధ రకాల పూజా కార్యక్రమాలు అర్చకులు చేశారు. స్వామివారి గ్రామోత్సవం పురవీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు అత్యంత వైభవంగా చిలక వాహనంపై గ్రామోత్సవ చేయడంతో అడుగడుగునా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కర్పూర హారతులతో స్వామివారికి సమర్పించి వారు మొక్కులు తీర్చుకొని ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమానికి ఉప ఎంపీపీ ఆవుల శ్రీనివాసులు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి మల్లికార్జున్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ సురేష్, పాలక మండల సభ్యులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సాముహిక అక్ష్యరాభ్యాసం



**ముత్తుకూరు, జూన్ 18, ప్రభాతవార్త :** మండలంలోని బలిజపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో 3 సంవత్సరాలు పూర్తి అయిన పది మంది ఏడబ్ల్యూసిలో ప్రీ స్కూల్‌కి నమోదు చేసి వారికి అక్షరాభ్యాసం వైభవంగా బుధవారం నిర్వహించారు. అంగన్‌వాడి కార్యకర్త డివి సుబ్బమ్మ అంగన్‌వాడి కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులకు పంతులు శేషు స్వామి చేతుల మీదుగా సామూహిక అక్షరాభ్యాసం జరిపించారు. సూపర్‌వైజర్ రమాదేవి, ఆయా కామేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా బోడే రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు



**నెల్లూరు సిటీ, జూన్ 18, ప్రభాతవార్త :** భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ జన్మదిన వేడుకలను నెల్లూరు నగరంలో యాదవసంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మి నాగ కిషోర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బొమ్మి నాగ కిషోర్ మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం దక్కాలన్న లక్ష్యంతో బోడె రామచంద్ర యాదవ్ భారత చైతన్య యువజన పార్టీని స్థాపించారన్నారు. బీసీలు రాజకీయంగా అభివృద్ధి చెందాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎస్ఎస్ యాదవ్, నక్కా దినేష్ యాదవ్, రామ్మోహన్ యాదవ్, నాగేంద్ర యాదవ్, మురళి మోహన్ రాజు, రమేష్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## తాటిపర్తి, మహమ్మదపురం గ్రామాలలో పొలంబడి కార్యక్రమం



**పొదలకూరు, జూన్ 18, ప్రభాతవార్త** పొలంబడి కార్యక్రమంలో భాగంగా తాటిపర్తి, మహమ్మద పురం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్ రైతులతో మాట్లాడుతూ వరి నారుమళ్ల యాజమాన్యం, నారు నాటే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. అదే విదంగా అన్నదాత సుఖీభవ ఈకేవైసి స్టేటస్ తెలుసుకొనుటకు దగ్గరలోని రైతు సేవ కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద సరిచూసుకోవాలి అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఏడుకొండలు నాయక్, వి ఎ ఎ భారతి, మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ జాబ్ కార్డును పునరుద్దరించండి

**బిట్రగుంట జూన్ 18ప్రభాతవార్త :** బోగోలు మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన అమిరిశెట్టి నాగప్రసాద్ తన ఉపాధిహామీ జాబ్ కార్డును పునరుద్దరణ చేయాల్సినదిగా మండల, జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. నేను కొన్ని సంవత్సరాల నుండి జీవనోపాధికోసం ఉపాధిహామీ కార్డు పైనే ఆధారపడుతున్నాను. కాగా ఈ ఏడాది ఏప్రిల్ 11 వ తేదీన నా జాబ్ కార్డు తొలగించడం జరిగిందన్నారు. ఆ తదుపరి మరల దరఖాస్తు చేసుకోగా నాకు, నా కుమారుడు కు కలిపి జాబ్ కార్డు మంజూరు చేయగా మరల రెండు వారాలు పని చేయగా ఎలాంటి సమాచారం లేకుండా తొలగించడం జరిగింది అని ఆవేదన చెందారు. ఈ విషయం పైన ఎన్ని సార్లు అర్జీలు ఎంపిడిఓకు, ఏపీవోకు పెట్టుకొని తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. దీనివల్ల గత రెండు నెలలుగా ఉపాధి లేకుండా పోయిందని ఆయన ఆవేదనచెందుతున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు జోక్యంచేసుకొని నాజాబ్ కార్డును పునరుద్దరణ చేసి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## చెన్నకేశవ, ఆంజనేయ స్వామి దేవస్థాన జీర్ణోద్ధరణ వార్షికోత్సవం



**బిట్రగుంట జూన్ 18 ప్రభాతవార్త:** బోగోలు మేజర్ పంచాయతీ లోని శ్రీ చెన్నకేశవ, ఆంజనేయ స్వామి ఆలయ జీర్ణోద్దారణ అనంతరం 20 వ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక హోమం, పూజలు, పూలంగిసేవ, కళ్యాణం, తీర్ధ ప్రసాదవినియోగం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ బచ్చు. కృష్ణకుమార్, సంధ్య దంపతులు ఆధ్వర్యంలో దాతల సహకారం తో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సాయి సేవకులు తమ సహకారం అందించారు.

## బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్



**బిట్రగుంట జూన్ 18 ప్రభాతవార్త** బోగోలు మండల నూతన తాసిల్దార్ గా ఎస్ శ్రీనివాసులు రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో రామాయపట్నం మారిటోరియం నుండి శ్రీనివాసుల రెడ్డి బోగోలు మండలానికి బదిలీ కాగా ఇక్కడ పని చేస్తున్న తహసిల్దార్ మలిశెట్టి సురేష్ బాబు కొండాపురం మండలానికి బదిలీ అయ్యారు. నూతన తాసిల్దార్ బాధ్యతలు చేపట్టగానే ఆయనకు డిప్యూటీ తాసిల్దార్ భరత్ కుమార్, కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ కార్యదర్శులు స్వాగతం పలికారు. అనంతరం సిబ్బందితో నూతన తాసిల్దార్ సమావేశమై రెవిన్యూ పరమైన అంశాలు జాప్యం లేకుండా ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

## ఓలేటి మృతికి రామిశెట్టి సంతాపం

**బిట్రగుంట జూన్ 18ప్రభాతవార్త** కావలి వార్త దినపత్రిక సీనియర్ విలేకరి ఓలేటి. నాగేశ్వరావు అనారోగ్య కారణాల వల్ల అకాల మృతి చెందడం పట్ల రామిశెట్టి వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామిశెట్టి వెంకట సుబ్బారావు ఒక ప్రకటన లో సంతాపం వ్యక్తం చేశారు. మృధుస్వభావి, సుపరిచుతులు, జర్నలిజంలో దశాబ్దాల కాలంపాటు అనుభవం కల్గిన వ్యక్తి మృతి చెందడం తీరని లోటని వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేసారు.

## తోటపల్లిగూడూరు తహశీల్దార్‌గా పద్మావతి

### - రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి



**తోటపల్లిగూడూరు, జూన్ 18, ప్రభాతవార్త** తోటపల్లిగూడూరు మండల తహశీల్దార్‌గా బి.పద్మావతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రెవెన్యూ బదిలీలలో భాగంగా గూడూరు డివిజన్ నుంచి బదిలీ అయ్యారు. గతంలో పలుచోట్ల తహశీల్దారుగా పని చేయడంతో పాటు నెల్లూరు కలెక్టరేట్‌లో పని చేసిన అనుభవం కలదు. తోటపల్లిగూడూరులో పని చేస్తున్న ఇన్‌ఛార్జీ తహశీల్దార్ కృష్ణ ప్రసాద్ బదిలీ కావడంతో ఆ స్థానంలో పద్మావతి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధ్యమైనంతవరకు సామరస్యంగా రెవెన్యూ సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తానని తెలిపారు. విధి నిర్వహణలో తనకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## 21న ప్రతి సచివాలయంలో యోగాంధ్ర



కోవూరు, జూన్ 18 ప్రభాతవార్త : కోవూరు మండలంలోని అన్ని సచివాలయాల్లో ఈ నెల 21వ తేది యోగాంధ్ర కార్యక్రమాలను తప్పనిసరిగా చేపట్టాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇంకా ఏ సచివాలయంలోనైనా యోగాంధ్ర రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉంటే వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ప్రజలకు యోగాపై అవగాహన కల్పించే కార్యక్రమాలను తరచుగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత, తదితర అంశాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించి చెత్త నుంచి సంపద కేంద్రాలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## నూతన తహసిల్దార్‌ను కలిసిన జనసేన నాయకులు



అనుమసముద్రంపేట, జూన్18, ప్రభాతవార్త: మండల నూతన తహసి ల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కె.అనిల్‌కుమార్‌ను మండల జనసేన నాయకులు బుధవారం తహసిల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా నాయకులు మండలంలోని సమస్యలను తహసిల్దార్ దృష్టికి తీసుకెళ్ళారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. స్పందించిన తహసిల్దార్ మండల ప్రజలకుఎలాంటి సమస్యలున్నా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జనసేన మండల అధ్యక్షుడు సయ్యద్ అక్బర్‌బాషా, ప్రవీణ్, ఖాజనవాజ్, మొహమ్మద్ వలిజాన్ తదితరులుపాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొనసాగించాలి : సిఐటియు




కావలిరూరల్, జూన్18 ప్రభాతవార్త ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొనసాగించాలని సిఐటియు రాష్ట్రపిలుపుమేరకు అనుబంధ మున్సిపల్ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందచేసి సిఐటియు పట్టణ కార్యదర్శి వై.కృష్ణ మోహన్ మాట్లాడారు. మున్సిపల్ కార్మికులు చాలీ,చాలని జీతాలతో పనులు చేస్తుంటారని తెలియచేశారు. వీరిపిల్లలకు తల్లికి వందనం నగదు పడలేదని కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా చూపించి సంక్షేమపథకాలకు కోతపెట్టడం చాలా అన్యాయమని తెలియచేశారు. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమపథకాలు అన్నింటిని కొనసాగించాలని తెలియ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల వాగ్దానాలలో 25వేల రూపాయలలోపు ఉన్నవారందరికి సంక్షేమపథకాలు అందిస్తామని చెప్పడం జరిగిందని తెలియచేశారు. అధికారంలోకి వచ్చినతర్వాత మున్సిపల్ కార్మికులకు సంక్షేమపథకాలలో కోత పెట్టడం విడూరంగా ఉందని తెలియచేశారు. రాష్ట్రప్రభుత్వం ఎన్నికలపుడు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని తెలియచేశారు. తల్లికి వందనం నగదు ఇవ్వాలని, అలా జరగని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన కొనసాగిస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బాబు, శివయ్య, పోలయ్య, బిడుదల మహేష్, మహిళా నాయకులు పల్లెపాటి అనిత, అలేఖ్య, తదితర కార్మికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనలకి విరుద్దంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలని అమ్మటం వ్యతిరేకిస్తున్నాం : ఎస్ఎఫ్ఐ




**ఇందుకూరుపేట, జూన్ 18, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలం 6వ మైల్ దగ్గర ఉన్నటువంటి శ్రీ చైతన్య పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా అధ్యక్షులు వెన్ను నరేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకి వ్యతిరేకంగా కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థలైనటువంటి శ్రీ చైతన్య పాఠశాలలో అక్రమంగా పాఠ్యపుస్తకాల పేరుతో పెద్దఎత్తున వ్యాపారం చేయటాన్ని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నాకు దిగడం జరిగిందన్నారు. అలాగే ప్రస్తుతం ఈ రోజు ఈ యొక్క కార్పొరేట్ విద్యాసంస్థలు అటువంటి శ్రీ చైతన్య పాఠశాలలో ఈ రోజు అధికంగా ఫీజులు వసూళ్ల చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పార్టీ పుస్తకాలు యూనిఫామ్, విద్యార్థులకు అవసరమైనటువంటి అన్నింటిని కూడా పాఠశాల వద్ద అమ్మటం దుర్మార్గమని అన్నారు. విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా పాఠశాలల్లో ఈ రోజు అధిక ఫీజులు వసూళ్ల చేస్తూ విద్యను వ్యాపారం దిశగా నడిపిస్తున్నటువంటి ఈ యొక్క శ్రీ చైతన్య పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, పర్మిషన్ లేకుండా పాఠశాలల్లో నడుపుతున్నటువంటి పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకొని వాటి యొక్క పర్మిషన్లు, వాటిని సిస్ చేసే విధంగా దృష్టి పెట్టాలని ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా కమిటీగా డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ విధమైనటువంటి కార్యక్రమాల్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఖచ్చితమైనటువంటి కార్యక్రమాల్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఖచ్చితమైనటువంటి కృషి చేస్తామని తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు విక్రమ్, దేవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు యగ్నేష్, దివేశ్, యశ్వంత్, బాబి, సుకుమార్, నాగేంద్ర, సంతోష్, దిలీప్, కిరణ్ పాల్గొన్నారు.

## మాబడి మాకు కావాలి అంటు తల్లిదండ్రుల నిరసన



**మనుబోలు జూన్ 18 ప్రభావార్త** మనుబోలు అరుంధతీయ కాలనీ వాసులు మా బడి మాకు కావాలి అంటు మండల ఎండిఓ కార్యాలయం వద్ద బుధవారం నిరసనకు దిగారు అరుంధతీ వాడ పాఠశాలను మోడల్ పాఠశాలలో భా గం గా మనుబోలు గ్రామంలోని పాఠ శాలకు కలుపుతు ఉత్తర్వులు వెలువడడం తో విద్యార్థుల తల్లిదండ్రులు వారి సమస్యలను విన్నవించుకుంటు ఎంఈఓకి వినతి పత్రం అందజేశారు. తమ పిల్లలు ప్రస్తుత పాఠశాల నుండి దూరంగా వెళ్ళి చదువుకోవాలంటే సుమారు రెండు కిలో మీటర్లు వెళ్ళడమే కాకుండా జాతీయ రహదారి దాటుకొని వెళ్ళాలని తాము కూలీ పనులు చేసుకొని జీవనం సాగించే వాళ్ళమని వారిని అంత దూరం పంపలేమని వారు వాపోయారు. అదే విధంగా పక్కనే ఉన్న గిరిజన కాలనీ పిల్లలు కూడా అదే స్కూల్‌ల్లో చదువుతున్నారని వారు కూడా ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వారు తెలిపారు. అధికారులు దయ వుంచి ఇక్కడ పాఠశాలలో చదువుకునే వారిని మార్చకుండా ఇక్కడే ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని లేకుంటే మా పిల్లలను బడి మానిపించే పరిస్థితులు వస్తాయని వారు ఆవేధన వ్యక్తం చేశారు.

## వరిలో ఎరువుల యాజమాన్యం తప్పనిసరి



**కోవూరు, జూన్ 18 ప్రభాతవార్త :** ప్రస్తుతం వ్యవసాయం సాగు చేసే రైతులు తప్పనిసరిగా వరిలో ఎరువుల యాజమాన్య పద్దతులు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి టి.రజని తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు భూసారం పెంచుకునే పచ్చిరొట్ట పైర్లు, జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా వ్యవసాయం సాగు చేసే ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుని యునిక్ ఐడీ పొందాలన్నారు. ఎరువులు, పురుగుమందులను తమ ఇష్టానుసారంగా వాడకుండా వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే వాడుకోవాలన్నారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఇంకా రైతులు ఎవరైనా ఈకేవైసీ చేయించుకోకపోతే వెంటనే చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శ్వేతలేఖ, శిరీష, రైతులు ఉన్నారు.

## జయభారత్ హాస్పిటల్‌కు రెండు లక్షల విరాళం



**నెల్లూరు, జూన్ 18, ప్రభాతవార్త-వైద్యం** బెజవాడ శ్రీకృష్ణారెడ్డి వారి 89వ జన్మదిన సందర్భంగా వారి తల్లి తండ్రులు బెజవాడ చంద్రరెడ్డి, బుజ్జమ్మ జ్ఞాపకార్థం జయభారత్ హాస్పిటల్‌లో జరుతున్న ఉచిత కంటి ఆపరేషన్స్ పథకంకు రెండు లక్షల రూపాయలు విరాళం అందజేశారు. దీని ద్వారా పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్స్ చేయించాలని జయభారత్ హాస్పిటల్ చైర్మన్ పొన్నలూరు సీతారామిరెడ్డి కోరారు. ట్రస్టు చైర్మన్ మాట్లాడుతూ మొద్లో శ్రీకృష్ణారెడ్డి సహకారంతో వారి తండ్రి బెజవాడ రామచంద్రరెడ్డి కంటి విభాగం ప్రారంభించమని తెలిపారు. అప్పటి నుండి ఉచితంగా కంటి ఆపరేషన్స్ చేస్తున్నామని, ఇప్పటి వరకు 25000 మందికి ఆపరేషన్స్ చేశామని చెప్పారు. శ్రీకృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారు అందజేసిన విరాళంతో 100 మంది పేద వారికి కంటి ఆపరేషన్స్ చేస్తామని దీనిలో భాగంగా ఈ రోజు 10 మందికి చేశామని ఈ రోజు నుంచి ప్రతి రోజు 10 మంది పేద వారికి ఉచితంగా ఆపరేషన్స్ చేస్తామని తెలిపారు. దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

**దస్తావేజులు పోయినవి**

నా క్లైయింటు అయిన పసల శేషమ్మ భర్త వెంకట సుబ్బయ్య గారు రేబాల గ్రామములోని పొలమునకు సంబంధించి ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.1858/2004, 1002/2006, 2954/2010 మరియు లింక్ డాక్యుమెంట్స్ 660/2006, 1071/2000, 1101/1988, 357/1986, 356/1986, 15.06.2025 వ తేదిన రేబాల గ్రామములోని జెరాక్స్ సెంటర్ నందు జెరాక్స్ తీయించుటకు పోగా అక్కడ పోయినవి. ఈ ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఎవరికైనను దొరికిన యెడల క్రింది అడ్రస్సుకు సంప్రదించగలరు.

| | |
|---|---|
| పి.శేషమ్మ<br>సెల్: 9848756965 | సం/-వి.నరసింహారావు B.A., B.L.,<br>అడ్వకేట్ & నోటరీ<br>సెల్: 98484 14967 |

**కెనరా బ్యాంక్ Canara Bank**
**స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్**
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అవిలాల, తిరుపతి-517501. ✆ 7901626759

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద**
**REDEMPTION NOTICE**

టు:
1. M/s వర్షినియా యాంటీ కొరోసివ్ పెయింట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న వారు పార్టనర్స్ : శ్రీ సేతుదీప్ చంద్రమౌళి & శ్రీ బెనుదీప్ చంద్రమౌళి, సర్వే నెం.243-భాగం, ప్లాట్ నెం.45, బ్లాక్-బి, ఇండస్ట్రియల్ పార్క్, మేనకూర్ గ్రామం, మేనకూర్ గ్రామ పంచాయతీ, నాయుడుపేట మండలం, తిరుపతి-524421.
2. శ్రీ సేతుదీప్ చంద్రమౌళి (పార్టనర్స్ & తనఖాదారులు), తండ్రి : డి. సుమిత్రప్ప, ప్లాట్ నెం.70, నరుకూరు, కోకో కోలా ఎదురుగా, గుడిపల్లిపాడు, నెల్లూరు.
3. శ్రీ బెనుదీప్ చంద్రమౌళి (పార్టనర్స్ & తనఖాదారులు), తండ్రి : డి. సుమిత్రప్ప, ప్లాట్ నెం.70, నరుకూరు, కోకో కోలా ఎదురుగా, గుడిపల్లిపాడు, నెల్లూరు.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్, తిరుపతి యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

లోను అకౌంట్ ఋణగ్రహీత/సంస్థ M/s వర్షినియా యాంటీ కొరోసివ్ పెయింట్స్ వారిని బకాయి **తేది.28.06.2024 నాటికి రూ.69,22,767.10/- (అక్షరాల అరవై తొమ్మిది లక్షల ఇరవై రెండు వేల ఏడు వందల అరవై ఏడు రూపాయల పది పైసలు మాత్రమే)** మరియు వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ అధీకృత అధికారి **28.06.2024 వ తేదిన చట్టం నందలి సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి **తేది. 17.09.2024** న మీ సెక్యూర్డ్ ఆస్తులను చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక / భౌతిక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును సాక్షి మరియు ది హాన్స్ ఇండియా వార్తాపత్రికలలో **తేది.22.09.2024** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు **తేది.30.05.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.78,83,955.83/- (అక్షరాల డెబ్బై ఎనిమిది లక్షల ఎనభై మూడు వేల తొమ్మిది వందల యాభై ఐదు రూపాయల ఎనభై మూడు పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు వారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తేది: 30.05.2025, ప్రదేశం: తిరుపతి — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

**కెనరా బ్యాంక్ Canara Bank**
**స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్**
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అవిలాల, తిరుపతి-517501. ✆ 7901626759

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద**
**REDEMPTION NOTICE**

టు:
1. శ్రీ మోచర్ల శ్రీనివాసులు రెడ్డి, తండ్రి : వెంకు రెడ్డి, ఫ్లాట్ నెం.17, గోమతి నగర్, కావేరీ ఎస్టేట్స్, మినీ బైపాస్ రోడ్, నెల్లూరు-524003 (ఋణగ్రహీత)
2. శ్రీ జాఫర్ షేక్, తండ్రి : రహమతుల్లా, ఫ్లాట్ 24, కావేరీ ఎస్టేట్స్, మినీ బైపాస్ రోడ్, గోమతి నగర్, మాగుంటలేఅవుట్, నెల్లూరు-524003. (హామీదారు)

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్, తిరుపతి యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

లోను అకౌంట్ ఋణగ్రహీత/సంస్థ శ్రీ మోచర్ల శ్రీనివాసులు రెడ్డి, తనఖాదారు మరియు హామీదారులు వారిని బకాయి **తేది.03.10.2024 నాటికి రూ.23,97,887.78/- (అక్షరాల ఇరవై మూడు లక్షల తొంభై ఏడు వేల ఎనిమిది వందల ఎనభై ఏడు రూపాయల డెబ్బై ఎనిమిది పైసలు మాత్రమే)** మరియు వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ అధీకృత అధికారి **03.10.2024 వ తేదిన చట్టం నందలి సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి **తేది. 19.12.2024** న మీ సెక్యూర్డ్ ఆస్తులను చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక / భౌతిక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును ఈనాడు మరియు ది హాన్స్ ఇండియా వార్తాపత్రికలలో **తేది.21.12.2024** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు **తేది.31.05.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.26,15,023.082/- (అక్షరాల ఇరవై ఆరు లక్షల పదిహేను వేల ఇరవై మూడు రూపాయల ఎనభై రెండు పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు వారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తేది: 09.06.2025, ప్రదేశం: తిరుపతి — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

**కెనరా బ్యాంక్ Canara Bank**
**స్పెషలైజ్డ్ ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్**
కెవిసి ఆర్కేడ్, 3వ అంతస్తు, 13-1 ఆర్‌సి రోడ్డు, వాణి నగర్, అవిలాల, తిరుపతి-517501. ✆ 7901626759

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద**
**REDEMPTION NOTICE**

టు:
1. M/s అశ్రిత్ ఇంజనీరింగ్, ప్రొప్రయిటర్ : శ్రీ మదన్ మోహన్, డి నెం.2-104, గ్రౌండ్ ఫ్లోర్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కాంపౌండ్, ఇంజనీరింగ్ కాలనీ, బుజ బుజ, ఆటో నగర్, నెల్లూరు-524003.
2. శ్రీమతి వల్లపోతు లక్ష్మమ్మ, హెచ్ నెం.24-2-794, సరస్వతి నగర్, దర్గామిట్ట, నెల్లూరు-524003.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ నోటీసు (ఇక మీదట "చట్టం"గా రిఫర్ చేయబడును).

కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎమ్. బ్రాంచ్, తిరుపతి యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్" గా రిఫర్ చేయబడును), సదరు సర్ఫేసీ చట్టంలోని సెక్షన్ 13 (8) క్రింద చదవబడు రూల్ 8(6) అనుసరించి మీ అందరికీ ఈ నోటీసును జారీచేయడమైనది.

లోను అకౌంట్ ఋణగ్రహీత/సంస్థ M/s అశ్రిత్ ఇంజనీరింగ్, తనఖాదారు, హామీదారులు వారిని బకాయి **తేది.22.08.2016 నాటికి రూ.74,97,217.51/- (అక్షరాల డెబ్బై నాలుగు లక్షల తొంభై ఏడు వేల రెండు వందల పదిహేడు రూపాయల యాభై ఒక్క పైసలు మాత్రమే)** మరియు వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ కెనరా బ్యాంక్ అధీకృత అధికారి **26.08.2016 వ తేదిన చట్టం నందలి సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి **తేది. 10.10.2017** న మీ సెక్యూర్డ్ ఆస్తులను చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద లాంఛనాత్మక / భౌతిక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును సాక్షి మరియు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తాపత్రికలలో **తేది.12.10.2017** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు **తేది.30.04.2025** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.2,97,14,239.57/- (అక్షరాల రెండు కోట్ల తొంభై ఏడు లక్షల పద్నాలుగు వేల రెండు వందల ముప్పై తొమ్మిది రూపాయల యాభై ఏడు పైసలు మాత్రమే)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది. (ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు వారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారినుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజల నుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తేది: 26.05.2025, ప్రదేశం: తిరుపతి — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

## శ్రీ చాముండేశ్వరి అమ్మవారి హుండీ లెక్కింపు

**ఇందుకూరుపేట, జూన్ 18, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం గ్రామంలో వెలసియున్న శ్రీ చాముండేశ్వరి అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం జరిగింది. అమ్మవారి హుండీల ద్వారా రూ.3,22,985లు భక్తులు కానుకగా సమర్పించగా అన్నదానం ద్వారా రూ.43499లు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొరుటూరు గ్రూప్ దేవాలయాల ఈవో కవిత, కార్యనిర్వహణ అధికారి తాత శ్రీనివాసరావు ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పాత్రికేయ రంగానికి ఒక లెజండ్ "ఓలేటి"

## పలువురు ప్రముఖులు



**కావలిరూరల్, జూన్18 ప్రభాతవార్త** వార్త జాతీయ దినపత్రిక సీనియర్ పాత్రికేయులు, కావలి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు, ఆర్యవైశ్యప్రముఖులు, జర్నలిస్ట్‌క్లబ్ వ్యవస్థాపకులలో ముఖ్యులు ఓలేటినాగేశ్వరరావు పాత్రికే యరంగానికి ఒక లెజండ్ అని ఆయన ఆకస్మిక మరణం తీరని లోటని ఆయన ఎంతోమంది యువ జర్నలిస్ట్‌లకు ఆదర్శమని పలువురు ప్రముఖులు బుధవారం పేర్కొన్నారు. ఆయన అకాల మృతికి పలువురు సంతాపం తెలియచేశారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతిని వ్యక్తంచేశారు.

**-ఒకమంచి మిత్రుడినికోల్పోయామన్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర** ... కావలి నియోజకవర్గంలో త్రిసభ్య కమిటి సభ్యుడిగా ఉన్నప్పటినుండి ఓలేటి నాగేశ్వరరావుతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని, అతని అకాలమృతి తనను తీవ్రంగా కలిచివేసిందని టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. ఓలేటి అకాలమృతిపట్ల తాను ఒక మంచి మిత్రుడిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. కావలిలో జర్నలిజంలో దశాబ్దాలపాటు పనిచేస్తూ ముక్కుసూటిగా వ్యవహరిస్తూ వార్త దినపత్రికకే ప్రత్యేక గుర్తింపు ఇచ్చిన ఓలేటి మృతిపట్ల తాను ప్రగాఢసానుభూతిని వ్యక్తం చేస్తూ వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢసంతాపాన్ని తెలియచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**-జర్నలిస్ట్ రంగంలో ఓలేటి అందించిన సేవలు ఎనలేనివి...వంటేరు...** ప్రముఖ సీనియర్ పాత్రికేయులు ఓలేటి నాగేశ్వరరావు హఠాన్మరణం బాధాకరమని, వారి మృతిపట్ల తీవ్రదిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తున్నానని కావలి మాజీ శాసనసభ్యులు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తెలియచేశారు. 40 సంవత్సరాలుగా జర్నలిస్ట్ రంగంలో ఆయన అందించిన సేవలు ఎనలేనివని, ప్రజల సమస్యలు వెలుగులోకి తేవడంలో ఓలేటి పాత్ర అపూర్వమని తెలిపారు. ఓలేటితో నాకు 35 సంవత్సరాలుగా సాన్నిహిత్యం ఉందన్నారు. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢసానుభూతిని తెలియచేస్తున్నానన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

**ఓలేటి మరణం బాధాకరం... డాక్టర్ యన్.ప్రభాకర్‌నాయుడు** సీనియర్ పాత్రికేయులు, ఆర్యవైశ్యప్రముఖులు ఓలేటి నాగేశ్వరరావు మరణం బాధాకరమని, ఆయనకు తనకు ఉన్న అనుబంధం మరువలేనిదని ఆయన లేనిలోటు పత్రికారంగానికి తీరలిలోటు అని తెలిపారు. ప్రజలపక్షాన నిలబడి అనేక సంచలనాత్మక కథనాలను అందించి సమాజసేవలో తమవంతు పాత్ర పోషించారని ప్రజావైద్యులు, కావలి మాజీ మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ యన్.ప్రభాకర్‌నాయుడు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

**-ఓలేటి అకాల మరణం సమాజానికి తీరలిలోటు... బిజెపి**

సీనియర్ పాత్రికేయులు, ఆర్యవైశ్య ప్రముఖులు ఓలేటి నాగేశ్వరరావు అకాల మరణం పాత్రికేయ రంగంతోపాటు మాకుకూడా ఎంతో తీరనిలోటు అని బిజెపి రాష్ట్రసంయుక్త కోశాధికారి, శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం శాశ్విత గౌరవఅధ్యక్షులు, కందుకూరి గ్రూప్ ఆఫ్ అధినేత కందుకూరివెంకట సత్యనారాయణ, బిజెపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్, జిల్లా టెలికామ్ అడ్వైజర్ కమిటి సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, బిజెపి కావలి 1వ పట్టణ అధ్యక్షులు మందాకిరణ్‌లు తెలిపారు. ఓలేటి గత 40 సంవత్సరాలుగా పాత్రికేయరంగంలో విశేషసేవలు అందించారని తెలియచేశారు.

**-ఓలేటి మరణం జర్నలిస్ట్‌లకు తీరనిలోటు...** ఆర్యవైశ్యప్రముఖులు, ప్రముఖ పాత్రికేయులు ఓలేటి నాగేశ్వరరావు మరణం పాత్రికేయ రంగానికి తీరనిలోటని పత్రికారంగంలో ఒక ప్రత్యేకతను చాటుకున్నారని వామపక్ష నేతలు కరవదిభాస్కర్, పసుపులేటిపెంచలయ్య, దామాఅంకయ్య, దుర్గాబాబులు తెలియచేశారు. ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

**-నాగేశ్వరరావు మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన...ఎడిపియస్**

సీనియర్ పాత్రికేయులు, ఆర్యవైశ్యప్రముఖులు ఓలేటి నాగేశ్వరరావు మృతి పట్ల దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన అకాలమృతి చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలియచేశారు.

**-ఓలేటి ఇకలేరు అనేది చాలా బాధకరం...ఎమ్మార్పీయస్**

ప్రముఖ పాత్రికేయులు, ఆర్యవైశ్యప్రముఖులు ఓలేటి నాగేశ్వరరావు మృతి బాధాకరమని ఎమ్మార్పీయస్ నేతలు మంద వెంకటేశ్వర్లుమాదిగ, గోచిపాతల వెంకటేశ్వర్లుమాదిగ, యేసురత్నంమాదిగ, శివయ్య మాదిగలు తెలియచేశారు. ఆయన 40యేళ్ల సుదీర్ఘపోరాటంలో మాకు అండగా నిలుస్తూ సహకరించిన నాగేశ్వరరావు లేకపోవడం, ఒక మంచిమిత్రుడుని కోల్పోవడం హృదయాన్ని కలిచివేసిందని తెలియ చేశారు. ఆయన మృతికి ప్రగాఢసంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతిని వ్యక్తం చేయడం జరిగింది.

# ప్రతిభా పురస్కారాల అవార్డుల ప్రధానోత్సవంలో పాల్గొన్న వేమిరెడ్డి, కోటంరెడ్డి

## - సరస్వతీ సమాజం సేవలు అభినందనీయమన్న ఇరువురు నేతలు



**నెల్లూరు, జూన్ 18, ప్రభాతవార్త-వైద్యం** మూలపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతి సమాజం ప్రతిభా పురస్కారాల అవార్డు ప్రధానోత్సవంలో ముఖ్య అతిధులుగా నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొని పదవ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక అవార్డులను అందించారు. ఇరువురు నేతలు సరస్వతీ సమాజంలో ఏర్పాటు చేసిన నూతన భోజనశాలలను ప్రారంభించారు. వారిని సరస్వతి సమాజం నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా సరస్వతి సమాజం నిర్వాహకులు విద్యార్థుల అభివృద్ధికి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి మాటాడుతూ ప్రతిభ కలిగిన నిరుపేద విద్యార్థులకు ప్రతి ఏడాది నగదు ప్రోత్సాహకాలను అందిస్తూ సరస్వతీ సమాజం అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. రాష్ట్ర మంత్రి వర్యులు డాక్టర్ నారాయణ పేద విద్యార్థుల కోసం వీఆర్ హైస్కూల్, మూలపేట ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నారన్నారు.




# వైభవంగ శ్రీవెంగమాంబ కళ్యాణోత్సవం

## పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే కాకర్ల





**దుత్తలూరు, జూన్18, ప్రభాతవార్త:** శ్రీవెంగమాంబ పేరంటాళ్ళ అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగ మూడవరోజు బుధవారం శ్రీవెంగమాంబ, గురవయ్యానాయుళ్ళ కళ్యాణ మహోత్సవం అత్యంత వైభ వంగ నిర్వహించారు. మొదటిగ పసుపు, కుంకుమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ పట్టువస్త్రాలు సమర్పించారు. వేదమంత్రోచ్చరణలమధ్య వెంగమాంబ గురవయ్య నాయుడు దంపతులకు అభిషేక కార్యక్రమాలు నిర్వహించి కళ్యాణవేదిక వద్దకు మేళ, తాళాల నడుమ తీసుకొచ్చి వివిద రకాల పూజల అనంతరం వేదమంత్రాలతో కళ్యాణాన్ని నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలుపోసి భక్తులు కనువిందుగ దర్శించేల వేదపండితులు కళ్యాణ వైభవాన్ని నిర్వహించారు . ఈకార్యక్రమానికి మాజి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె దీపావెంకట్, మాజి ఎమ్మెల్యే కంభం విజయరామి రెడ్డి, ఆలయ పాలకమండలి ఛైర్మన్ తుమ్మల సురేష్‌బాబు, పచ్చవ కరుణాకర్, ఆలయ ఇఒ ఉశశ్రీ, పాల్గొని కళ్యాణాన్ని వీక్షించారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు రాష్ట్ర నలుమూలలనుంచి భక్తులు తరలివచ్చారు. రాత్రికి అమ్మవారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగ నిర్వహించారు. మేళ, తాళాలు, డప్పు ఆయి ద్యాలు, టపాసుల మోతల నడుమ నర్రవాడ ప్రధాన వీదులలో ఈగ్రామోత్సవం అత్యంత వైభవంగ నిర్వహించారు.

# యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం



**నెల్లూరు సిటీ, జూన్ 18, ప్రభాతవార్త** యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందని మెప్మా పథక సంచాలకులు బాల లీలారాణి పేర్కొన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా మెప్మా, మిషన్ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో స్వయం సహాయక బృంద సభ్యులు, వారి కుటుంబ సభ్యులను నమోదు చేసారు. నమోదు అయిన సభ్యులందరికీ యోగా మీద అవగాహన కల్పించుటకు 799 మంది వాలంటీర్లను ప్రతి 100 మంది నమోదైన సభ్యులకు ఒకరు చొప్పున ఎంపిక చేసి వారికి ప్రతి రోజు యోగా సాధన చేయుట, నేర్పించుట జరుగుతుందన్నారు. జూన్ 21న ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభం అయ్యే యోగా కార్యక్రమంలో ప్రతి వార్డు నందు ఎంపిక చేసిన ప్రదేశములలో మున్సిపల్ కమిషనర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసి ఆయా మున్సిపాలిటీలలోని మెప్మా సిబ్బంది అందరు, వారి పరిధిలోని నమోదు అయిన స్వయం సహాయక బృంద సభ్యులు భాగస్వాములం యోగా దే కార్యక్రమం జిల్లాలో విజయవంతం అయ్యే విధంగా కృషి చేయాల్సిందిగా తెలియజేసారు.

# నెల్లూరు జిల్లా ఆగ్రోస్ కార్యాలయాన్ని సందర్శించిన మాలేపాటి



**దగదర్తి, జూన్ 18, ప్రభాతవార్త** రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ శ్రీమాలేపాటి సుబ్బానాయుడు బుధవారం నెల్లూరులోని రైల్వే ఫీడర్స్ రోడ్డు నందుగల జిల్లా ఆగ్రోస్ కార్యాలయాన్ని సందర్శిం చడం జరిగింది. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యాలయంలో జరిగేటువంటి కార్యక లా పాలను నిశితంగా పరిశీలించారు. కార్యాలయ సిబ్బందితో మాట్లాడి ఆగ్రోస్ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. అనంతరం కార్యాలయ ఆవరణలో చెట్లు నాటడం జరిగింది. ఆగ్రో సంస్థ నెల్లూరు జిల్లా మేనేజర్ డి.విద్యాసాగర్, తోటి సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలల్లో యోగాకు ప్రాధాన్యం ఇవ్వండి




**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 18, ప్రభా తవార్త** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని పాఠశాలల్లో విద్యా ర్థులకు యోగా ప్రాముఖ్యత గురించి తెలియజేయాలని నెల్లూరు నగర, రూరల్ మండల విద్యాశాఖాధికారి బి.తి రు పాలు సూచించారు. ఈనెల 21వ తేదీ జాతీయ యోగా దినోత్సవాన్ని దృష్టిలో పెట్టుకుని 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రతి రోజు విద్యార్థులకు పాఠశా లల్లో యోగా క్లాస్ నిర్వహించాలని ఆయన తెలిపారు. సాయంత్రం 3.30గంటల నుండి 4గంటల వరకు యోగా క్లాస్ నిర్వ హించాలని చెప్పారు. ఈనెల 21న జాతీయ యోగా దినోత్సవం ప్రతిష్ఠాత్మకంగా నిర్వ హించడం జరుగు తుందన్నారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ పాఠశాల విద్యార్థులు నెల్లూరులోని ఏపీ స్టేడియంలో జరిగే యోగా దినోత్సవంలో పాల్గొనాలని అన్నారు. ఆ రోజు ఉదయం 6గంటలకు అన్ని పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులను యోగా దినోత్సవానికి తరలించాలని కోరారు. ఆ రోజు 7గంటల నుంచి 8 గంటల వరకు యోగ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. తదుపరి విద్యార్థులను జాగ్రత్తగా వారి వారి పాఠశాలలకు తరలించాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు, పీఈటీలకు సూచించారు.

# బొత్సను పరామర్శించిన రామిశెట్టి



**బిట్రగుంట జూన్ 18 ప్రభాతవార్త:** రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు బొత్స సత్యనారాయణ ను రామిశెట్టి వెంకట సుబ్బా రావు చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ రామిశెట్టి వెంకట సుబ్బారావు పరామర్శించారు. ఇటీవల ఒక కార్యక్రమం లో పాల్గొన్న బొత్స సత్యనారాయణ సొమ్మసిల్లి పడిపోవడం తో వైద్యుల సలహా మేరకు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్నారు. వ్యక్తి గతంగా సంబంధాలు రామిశెట్టికి ఉండటంతో ఆయనను పరా మర్శించి యోగక్షేమలు అడిగి తెలుసుకొని త్వరిత గతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఆదర్శ పాఠశాల ప్రిన్సిఫల్‌గా సమీరారెడ్డి



**సీతారామపురం జూన్18 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిఫల్ సిరిపురపు సమీరారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్త సాధరణ బదలీలలో భాగంగా ఆమె కర్నూలు జిల్లా కోసిగి ఆదర్శ పాఠశాల నుండి బదలీపై సీతారామపురం ఆదర్శ పాఠశాలకు వచ్చా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు విధులలో అంకిత భావంతో పనిచేసి పరీక్షలలో అత్యధిక ఉత్తీర్ణతతో విద్యార్థులు మంచి మార్కులు పొందేలా కృషి చేస్తానని ఆమె తెలిపారు.

# ఉదయగిరి వెలుగు ఏపీఎంగా సారా స్రవంతి బాధ్యతల స్వీకరణ



**ఉదయగిరి, జూన్ 18, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉదయగిరి ఏపీఎంగా సారా స్రవంతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నెల్లూరు డీపీఎం కార్యాలయంలో ఉన్నతి ఏపీఎంగా పని చేస్తూ ఉదయగిరి ఏపీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీసీగా పని చేస్తున్న ఆత్మకూరు అనిల్ కుమార్ నెల్లూరు డీఆర్‌డీఏ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు సంఘ బంధాలు, సభ్యులు, సీసీలు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను రికవరీలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

# ఖాదర్‌బాషా మృతి పార్టీకి తీరలిలోటు

## రాష్ట్రటిడిపి కార్యదర్శి మలిశెట్టి



**కావలిరూరల్, జూన్18 ప్రభాతవార్త** రాష్ట్ర తెలుగుదేశంపార్టీ మైనారిటీసెల్ కార్యదర్శి షేక్.ఖాదర్‌బాషా(ఇట్టు) మృతి పార్టీకి తీరనిలోటని రాష్ట్ర టిడిపి కార్యదర్శి, మాజీ ఎఎంసి ఛైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. కావలి పట్టణం మానసథియేటర్ సెంటర్‌లో ఖాదర్‌బాషా చిత్రప టానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖాదర్‌బాషా మృతి బాధాక రమన్నారు. ఆయన కుటుంబానికి తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందన్నారు. లోకేష్ బా బు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలు ఖాదర్‌బాషా కుటుంబానికి అండగా ఉంటా మని తెలియచేశారన్నారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



**సైదాపురం, జూన్ 18, ప్రభాతవార్త** గ్రామీణ్ పథకం కింద మం డలంలో జరుగు తున్న గృహ నిర్మాణ పను లు త్వరగా పూర్తి చేయాలని ఎం పీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. స్థానిక ప్రజా పరిషత్ కార్యాల యంలో హౌసింగ్ శాఖకు సంబంధించి ఏఈ శ్రీనివాసులతో కలిసి ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, వర్క్ ఇన్‌స్పె క్టర్‌కు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం అధనంగా ఎస్సీ వర్గానికి రూ.50 వేలు, బీసీ వర్గానికి రూ.50వేలు, ఎస్టీ వర్గానికి రూ.70వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. సాధ్యమైనంత వరకు జూన్ ఆఖరులోగా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయన అన్నారు. అదే విధంగా ప్రతి ఒక్క ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఫీల్డ్ వెర్ఫికేషన్ యాప్‌లో విజిట్ చేసినట్లు ఫొటోలు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. టాయిలెట్‌కు సంబంధించి కూడా గ్రౌండ్ మీద వర్క్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

# అధికారులతో సమీక్షా సమావేశం



**అనంతసాగరం, జూన్18, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అనంతసాగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఐహెచ్‌హెచ్‌ఎల్ ప్రోగ్రెస్ , ఒడిఎఫ్ ప్లస్ మోడల్ విలేజెస్ పై జాతీయ ఉపాది హామీ పనులపై ఆయన ఆరా తీశారు. మండలంలో ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టె ంట్లను ఆయన ఆదేశించారు. ఈసందర్భంగా ప్రతి ఒక్కరూ ఆధార్ కలిగి ఉండాలని, ఆధార్ లేనివారి కోసం ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని, 19వ తేదీ సోమశిల, 20న ఉప్పలపాడు సచివాలయాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ , డిడబ్ల్యుఎస్ కన్సల్టెంట్ నెల్లూరు, హౌసింగ్ ఎఇ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి సేవలు అభినందనీయం



**బుచ్చి జూన్ 18 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలో వ్యవసాయాధికారిగా పనిచేస్తు బదలీపై ఇందుకూరుపేటకు వెళ్ళిన సురేంద్రరెడ్డిని, బుచ్చిరెడ్డిపాళెం ఏఇఒగా పనిచేస్తు సంగం మండలానికి బదలీ అయిన ఆసమాను బుచ్చిరెడ్డిపాళెం ఎరువులు, పురుగు మందుల దుఖాణాల డీలర్లు ఘనంగా సన్మానిం చారు. ఈకార్యక్రమం వవ్వేరు బ్యాంకు సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఏటూరు శివరామకృష్ణారెడ్డి, కోవూరు అగ్రికల్చర్ ఏడి అనితా వ్యవహారించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతు 5 సంవత్సరాలు సురేంద్రరెడ్డి వ్యవసాయాధికారిగా రైతులకు మంచి సేవలు అందించారని వారు ప్రశంసించారు. అనంతరం సురేంద్రరెడ్డి మాట్లాడుతు బుచ్చిరెడ్డిపాళెం మండలంలో రైతులు నాకు పూర్తి స్థాయిలో సహకరించారని ప్రశంసించారు. ప్రత్యేకించి సూరా శ్రీనివాసులురెడ్డి తనకు పూర్తి స్థాయిలో సహయసహకారాలు అందించారని ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సురేంద్రరెడ్డికి, ఆసిమాకి శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు . ఈకార్యక్రమంలో చెర్లో సతీష్‌రెడ్డి, ఎరువులు, పురుగు మందుల షాపుల డీలర్ల అధ్యక్షులు అద్దెపల్లి శ్రీనివాసులు, రేబాల నాయకులు లఘంతోటి మస్తానయ్య, పెంచల నరసయ్య, పిడుగు మధు, వవ్వేరు బ్యాంకు సెక్రటరీ శ్రీనివాసులు, బుచ్చిరెడ్డిపాళెం రూరల్ బ్యాంకు సెక్రటరీ సురేష్‌రెడ్డి, అధికారులు బుచ్చిరెడ్డిపాళెం ఏఒ శ్రీహరి , శ్రీకాంత్‌రెడ్డి , పలువురు రైతులు, వ్యవసాయ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# దాతృత్వానికి నిర్వచనం దొడ్ల కోదండరామిరెడ్డి

**బుచ్చి జూన్ 18 ప్రభాతవార్త** పేద విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ చేయడం, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహాయసహకారాలు అందించడం ఇలా అనేక ధాన ధర్మాలు చేస్తు మనస్సున్న మంచి వ్యక్తి దొడ్ల కోదండరామిరెడ్డి అని తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు ప్రశంసించారు. విద్యార్థులు చిన్నతనం నుండి కష్టపడి చదివితే భవిష్యత్తులో సుఖ పడవచ్చునని ఆయన సూచించారు. కోదండరామిరెడ్డి లాంటి దాతలు, చరణ్‌రెడ్డి లాంటి దాతలు స్పందించి పేద విద్యార్థులకు ఇలాంటివి చేయాలని ఆయన కోరారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, డాక్టర్ అబ్దుల్ కలాం లాంటి మహానీయుల్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంఇఒ వెంకటరత్నం మాట్లాడుతు గత 5 సంవత్సరాలుగా రామచంద్రాపురం ప్రాధమికోన్నత పాఠశాలలో దొడ్ల కోదండరామిరెడ్డి విద్యాసామాగ్రిని అందజేయడం అభినందనీయమని అన్నారు. దొడ్ల కోదండరామిరెడ్డిని, తిరుపతిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ చేస్తున్న చరణ్‌రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం దాత దొడ్ల కోదండరామిరెడ్డి మాట్లాడుతు ప్రభుత్వం అమలు చేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణనన్ విద్యార్థి మిత్ర, తల్లికి వందనం, డొక్కాసీతమ్మ, మధ్యాహ్న బోజన పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతి రోజులు విద్యార్థులు పాఠశాలకు రావాలని ఆయన కోరారు. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విపిఆర్ పౌండేషన్ ద్వారా విద్యార్థులకు ఎన్నో సేవలు అందిస్తుందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంఇఒ వెంకటరత్నం, సామాజిక వేత్త గండికోట సుధీర్‌కుమార్ దొడ్ల కోదండరామిరెడ్డిని శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. అలాగే తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లును, ఎంఇఒ-2 రత్నంను, గండికోట సుధీర్‌ని కూడా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో కౌన్సిలర్ శ్రీదేవి, తెలుగుదేశం నాయకులు సునీల్, టిడిపి నాయకులు సుమన్ , ఉపాధ్యాయు లు అరుణకుమారి, మున్వర్ అహ్మద్, బ్రహ్మరెడ్డి, రసూల్, అహ్మద్‌న్నీసా బేగం, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

